
సాక్షి తూర్పుగోదావరి

గురువారం । 23 । మార్చి । 2023



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 1,730, మధ్య డెల్టాకు 1,125, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు.



అన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మానేపల్లి సూర్యనారాయణరావు (రామచంద్రపురం) రూ.1,01,116 విరాళాన్ని బుధవారం సమర్పించారు.

కొండాలమ్మకు వెండి పీఠం



నిడదవోలు రూరల్: పెరవలి మండలం కానూరులోని శ్రీ కొండాలమ్మ అమ్మ వారికి పందలపర్రు సర్పంచ్ పులుమంతుల రామారావు కుటుంబసభ్యులు రూ.1.56 లక్షలు విలువచేసే వెండి పీఠాన్ని బుధవారం బహూకరించారు.



న్యూస్‌రీల్

దేవీచౌక్ ఆలయానికి కేజీ వెండి సమర్పణ



దేవీచౌక్ ఆలయానికి వెండి సమర్పిస్తున్న భక్తులు

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయానికి బుధవారం భక్తులు వెండి సమర్పించారు. ఆలయంలో అంతరాలయం గోపురం వెండి తాపడానికి భక్తులు సుమారు కేజీ వెండిని అందజేశారు. గ్రామానికి చెందిన దాసరి తమ్మన్నదొర మనవరాలు పబ్బినీడి సౌజన్య, రాజశేఖర్ దంపతులు 250 గ్రాములు, పోలరౌతు ప్రసాద్, వీరలక్ష్మి దంపతులు 500 గ్రాములు, దాసరి వీరబాబు, శిరీష దంపతులు 250 గ్రాముల వెండిని సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం



దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో 2022–23 సీజన్‌కు గురువారం నుంచి ఎన్‌ఎల్‌ఎస్ పొగాకు కొనుగోళ్లను ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు వేలం కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటలకు కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్టు వేలం కేంద్రాల అధికారులు తెలిపారు. ఈ–ఆక్షన్ విధానంలో వేలం జరుగుతుంది. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెంలలో ఒక్కోచోట, జంగారెడ్డిగూడెంలోని రెండు చోట్ల పొగాకు కొనుగోళ్లు జరుగుతాయి. 2022–23 పంట కాలానికి 23,170 హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగు చేయడానికి రైతులు పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే 22,280 హెక్టార్లలో పంట వేసినట్టు పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. 12,772 మంది రైతులు 14690 బ్యారన్లను రిజిస్ట్రేషన్ చేశారు. 50.15 మిలియన్ల కిలోల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. సాగు విస్తీర్ణం పెరగడం వల్ల 52 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని బోర్డు అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు.

పసివాళ్లపై జ్వరం పంజా



తీవ్ర జ్వరానికి గురైన బాలుడిని పరీక్షిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

- చిన్నారులపై పెరుగుతున్న వైరల్ దాడులు
- పసిమొగ్గలను పట్టి పీడిస్తున్న వైనం
- ప్రభావం చూపలేకపోతున్న సాధారణ మందులు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

కాకినాడ క్రైం: కోవిడ్ వైరస్ ప్రభావానికి గురైంది మొదలు వ్యక్తి శరీరంలో యావత్ జీవ వ్యవస్థ కంపించిపోయింది. శరీర వ్యవస్థాగత జీవ నిర్మాణంలో పెను మార్పులకు కారణమైంది. చిన్నారులపై కోవిడ్ వైరస్ ప్రభావం తక్కువగానే ఉన్నా, అనుబంధ మహమ్మారుల దాడి మాత్రం ఆందోళన కలిగిస్తోంది. ఆ కోవలోనివే తాజాగా తెరపైకి వచ్చిన జ్వరాలు. ఇప్పటికే ఈ జ్వరాలపై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైరాలజీ విభాగం పరిశీలన మొదలు పెట్టింది.

అసాధారణ లక్షణాలు

నెల రోజులుగా కాకినాడ జీజీహెచ్ సహా చిన్న పిల్లల ప్రైవేటు ఆరోగ్య కేంద్రాల్లో చిన్నారుల ఓపీ గణనీయంగా పెరిగింది. 11–13 సంవత్సరాల వయసు మధ్య పిల్లలు తీవ్ర జ్వరాలకి గురవుతున్నారు. తీవ్ర జ్వరం, జలుబు, విపరీతమైన గొంతునొప్పి, వికారం, దగ్గు, ఆయాసం, వాంతులు, విరేచనాలు, ఒళ్లు నొప్పులు, కంట్లో నీరు, ఈ జ్వరం వచ్చినవారికి సాధారణ లక్షణాలు కాగా, ఐదేళ్లలోపు చిన్నారుల్లో అయితే ముక్కు, గొంతు నుంచి రక్తం కారడం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. వైరల్ జ్వరంగా మొదలవుతున్న అనారోగ్యం బ్యాక్టీరియల్‌గా రూపాంతరం చెందుతుందని వైద్యులు చెబుతున్నారు. సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌గా వృద్ధి చెంది తీవ్ర అనారోగ్యానికి దారి తీస్తుందని అంటున్నారు. వైరల్ జ్వరం సాధారణంగా 3–5 రోజుల మధ్య తగ్గిపోతే, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే జ్వరాలు తగ్గడానికి ఇన్ని రోజులనే నిర్దిష్ట వ్యవధి లేదు.

సాధారణ మందులకు లొంగక

సాధారణంగా పారాసిట్మాల్ సహా యాంటీబయాటిక్‌లు పిల్లల జ్వరాలు నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంటాయి. ఇప్పుడా పరిస్థితి లేదు. మందులెన్ని ఇస్తున్నా, ప్రయోజనం కానరావడం లేదు. వైరల్ జ్వరాలకు యాంటీ బయాటిక్స్ పనిచేయవని చెబుతున్న వైద్యులు గరిష్ఠంగా ఐదు రోజుల వ్యవధిలో కొనసాగే ఈ జ్వరాలకు లక్షణాల ఆధారంగా మాత్రమే మందులు సూచిస్తున్నామంటున్నారు. ఒక పరీక్షలో రెండు మూడు ఇన్ఫెక్షన్లు బయటపడుతున్న నేపథ్యంలో అవి వ్యాధికారక క్రిముల వల్ల సంభవించాయో లేదో గుర్తించడం కూడా కష్టమవుతోందని వైద్యులు ఆవేదన చెందుతున్నారు. వైరల్ దాడిలో ముక్కు, గొంతు, ఉదరం లోపలి సున్నిత పొరలు దెబ్బతింటాయని, ఫలితంగా ముక్కు, గొంతు నుంచి రక్తం కారే ఆస్కారం ఉందని అంటున్నారు.

ఒకరి నుంచి మరొకరికి...

తాజాగా తెరపైకి వచ్చిన ఈ జ్వరాలు, వాటి లక్షణాలు ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతూండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ జ్వరాల్లో సాధారణ లక్షణాలు అయిన తుమ్మడం, దగ్గడం ద్వారా డ్రాప్‌లెట్ల రూపంలో వైరస్ మరొకరికి సంక్రమిస్తుంది. పోస్టు కోవిడ్ బాధిత చిన్నారుల్లో వైరల్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని జీజీహెచ్ చంటి పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. పోషకాహార లోపం, రోగనిరోధక శక్తి లోపించిన వారు, సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ బారిన పడే వారిలో తీవ్ర అనారోగ్యాలు సంభవిస్తున్నాయని అన్నారు. చిన్నారుల అనారోగ్యాన్ని గుర్తించేందుకు ఎప్పటిలాగే సాధారణ వైద్య పరీక్షలు జీజీహెచ్‌లో చేస్తున్నట్టు వీఆర్‌డీఎల్ ల్యాబ్ ప్రిన్సిపల్ ఎగ్జామినర్ డాక్టర్ డీఎస్ మూర్తి తెలిపారు. ప్రతి రోజు అనుమానిత లక్షణాలున్న కనీసం 10 మంది పిల్లల రక్త, మూత్ర, కళ్లె నమూనాలను ప్రత్యేకంగా పరీక్షిస్తున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న కేసులు

కాకినాడ జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో చిన్నారులకు నిరాటకంగా వైద్య సేవలు అందుతున్నాయి. గడచిన నెల రోజుల వ్యవధిలో జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరుతున్న వారి సంఖ్య పెరిగింది. పలు జిల్లాల నుంచి జీజీహెచ్‌కు వస్తున్న పిల్లలకు అత్యంత నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించి రికవరీ చేస్తున్నట్లు హెచ్‌వోడీ డాక్టర్ ఎంఎస్ రాజు తెలిపారు.



కాకినాడ జీజీహెచ్‌లోని వార్డులో చికిత్స పొందుతున్న చంటిపిల్లలు

జ్వరం తగ్గినా లక్షణాలు తగ్గవు



చాలామంది పిల్లల్లో జ్వరాలు తగ్గడానికి సమయం పడుతోంది. ఈ స్థితిని వైద్య పరిభాషలో క్రానిక్ ఫేటిగ్ సిండ్రోమ్ అంటారు. పొటాషియం అధికంగా ఉండే కొబ్బరి నీళ్ల వంటి ద్రవాలతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా నీరసం, అలసట నుంచి పిల్లల్ని దూరం చేయవచ్చు. వైరల్‌కు పారాసిట్మాల్ తప్ప మరే మందుల సిఫార్సు చేయదగ్గది కాదు. ఆవిరిపట్టడం, ద్రవాలు ఎక్కువగా తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం పిల్లలు త్వరగా కోలుకునేందుకు సహకరిస్తుంది. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందాలు పనిచేస్తున్నాయి.

– డాక్టర్ వడ్డిపర్తి విజయభాస్కర్, అసోసియేట్ ప్రొఫెసర్, రంగరాయ వైద్య కళాశాల

గడచిన 8 రోజుల్లో జీజీహెచ్‌లో జ్వర బాధిత చిన్నారుల గణాంకాలు

14/3	–	49 మంది
15/3	–	55 మంది
16/3	–	52 మంది
17/3	–	79 మంది
18/3	–	81 మంది
19/3	–	89 మంది
20/3	–	88 మంది
21/3	–	96 మంది



జీజీహెచ్‌లోని వైరాలజీ ల్యాబ్‌లో చిన్నపిల్లల రక్త నమూనాలను పరీక్షిస్తున్న దృశ్యం

కళారంగానికి సీఆర్‌సీ సేవలు ఎనలేనివి

- నటుడు తనికెళ్ల భరణి, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- అట్టహాసంగా జాతీయ తెలుగు నాటిక పోటీలు ప్రారంభం



జ్యోతి వెలిగించి నాటిక పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



నాటికను వీక్షిస్తున్న సినీనటులు తనికెళ్ల భరణి, కోట శంకరరావు, గౌతంరాజు, నైనా తదితరులు

రావులపాలెం: భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో కళారంగానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని అంతరించి పోతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్(సీఆర్‌సీ) కాటన్ కళా పరిషత్ చేస్తున్న కృషి అభినందనీయం అని ప్రముఖ సినీనటుడు, సీఆర్‌సీ కాటన్ కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు తనికెళ్ల భరణి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం రావులపాలెంలోని సీఆర్‌సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో 23వ ఉగాది జాతీయ తెలుగు నాటికల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ప్రముఖ రచయిత, సినీ నటుడు తనికెళ్ళ భరణితో పాటు సినీనటుడు కోట శంకరరావు, గౌతంరాజు, నైనా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం నాటిక పోటీలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు 23 వసంతాలుగా నాటికలతో ఆలోచన రేకెత్తిస్తున్న సీఆర్‌సీ సేవలు ప్రశంసనీయం అని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా సీఆర్‌సీ కాటన్ కళాపరిషత్‌లో తల్లావఝుల సుందరం స్మారక పురస్కారాన్ని మల్లాది గోపాలకృష్ణకు తనికెళ్ళ భరణి అందజేశారు. సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగ మోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, పరిషత్ పర్యవేక్షణ డైరెక్టర్ వెలగల సతీష్‌రెడ్డి, డైరెక్టర్లు సీహెచ్ గోపాలకృష్ణ, కొవ్వూరి నరేష్‌కుమార్‌రెడ్డి, పడాల సత్యనారాయణరెడ్డి, మల్లిడి ఆంజనేయరెడ్డి, చిర్ల కనికిరెడ్డి, పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన నాటికలు

జాతీయ తెలుగు నాటికల పోటీల్లో భాగంగా మొదటిరోజు రెండు నాటికలను ప్రదర్శించారు. తెనాలి కళలు కణాచి వారి ''అంధస్వరం'' నాటిక సందేశాత్మకంగా సాగింది. మృగం నుంచి మనిషి మానవరూపం దాల్చడానికి కొన్ని లక్షల సంవత్సరాలు పడితే, మానవరూపం దాల్చిన మనిషి మృగంగా మారడానికి ఒక్క క్షణం మాత్రమే పడుతుందని, సృష్టి, స్థితి, లయలు నిక్షిప్తమైన పవిత్ర దేవాలయం స్త్రీ, ఆ దేవాలయానికి మృగాలకి మధ్య జరిగే సంఘర్షణే అంధస్వరం నాటికలో సందేశాత్మకంగా చెప్పారు. పొన్నూరు రసఝురి వారి 'కాపలా' నాటికలో ఇవాళ ప్రపంచం మొత్తం కాపలా నీడలో, భయం గుప్పిట్లో జీవిస్తోంది. ఈ కాపలాకు ఏ వ్యవస్థ మినహాయింపు కాదు, అంగవైకల్యం ఉన్నా తలెత్తుకుని జీవించవచ్చు, బుద్ధి వైకల్యం తలదించుకునేలా చేస్తుంది.

సీమెన్స్‌లో దోషులను బయటపెడతాం



విలేకరులతో మాట్లాడుతున్న మార్గాని భరత్‌రామ్

ఎంపీ మార్గాని భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి సీమెన్స్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని కోట్లాదిరూపాయలు పక్కదారి పట్టించిన వైనంలో దోషులను బయటకు లాగుతామని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నాటి చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందం పేరిట రూ.3,300 కోట్లు వెచ్చించనున్నట్టు ప్రకటించిందన్నారు. రాష్ట్రం పది శాతం, మిగిలిన 90 శాతం సీమెన్స్ సంస్థ వెచ్చిస్తుందని పేర్కొందన్నారు. ప్రభుత్వ వాటా రూ.371.25 కోట్లు చంద్రబాబు మళ్లించి అవకతవకలకు పాల్పడ్డారని ఎంపీ ఆరోపించారు. దీనికి సంబంధించి కీలక పత్రాలు చంద్రబాబు మాయం చేశారని ధ్వజమెత్తారు చంద్రబాబుతో తామేమీ ఒప్పందం కుదుర్చుకోలేదని సీమెన్స్ సంస్థ లిఖితపూర్వకంగా చెబుతోందన్నారు. ప్రభుత్వం వాటా రూ.371.25కోట్లు ఎవరి ఖాతాలోకి మళ్లాయో చంద్రబాబు, ఆయన పుత్రుడు లోకేష్ రాష్ట్ర ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సీమెన్స్ అంటే చంద్రబాబు, ఆయన అనుచరులు అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చెప్పింది నూరుశాతం వాస్తవమన్నారు. చంద్రబాబు, లోకేష్ స్కాంల్లో ఇదొకటి మాత్రమేనన్నారు. తవ్వేకొద్దీ మరెన్నో బయటపడతాయన్నారు. ప్రజల సొమ్మును అడ్డంగా బొక్కేసి మళ్లీ ఈ రాష్ట్రాన్ని నట్టేట ముంచేయడానికి తండ్రీ కొడుకులు సిద్ధపడుతున్నారన్నారు. యువగళం అంటూ గందరగోళం చేస్తున్న లోకేష్ కూడా తండ్రితో పాటు జైలు కెళ్లడం ఖాయమన్నారు.

ఊరూరా... ఉగాది శోభ

- కలెక్టరేట్‌లో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- పలుచోట్ల ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరు



ఉగాది వేడుకలలో పాల్గొన్న ప్రముఖులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలో బుధ వారం శోభకృత్ నామ ఉగాది వేడుకను సంప్రదాయ బద్ధంగా జరుపుకొన్నారు. ఉదయానికే ఆలయాలన్నీ భక్తులతో రద్దీగా కనిపించాయి. వివిధ ప్రాంతాల్లో పలు సంస్థల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పరస్పరం ఉగాది శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శ్రీశోభాకృత్ నామ ఉగాది వేడుకలు నిర్వహించారు. శ్రీ పురాణపండ జయలక్ష్మి మాధవన్ శిష్యబృందం, మణికంఠ శర్మ ఆధ్వర్యంలో వేదపఠనం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఓ నరశింహులు మాట్లాడుతూ ఈ ఏడాది వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారంతా రాణించి ఉత్తమ స్థానాలకు చేరుకోవాలని ఆంకాంక్షించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. రాజమహేంద్రవరం సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉగాది పండుగ ప్రాధాన్యత విశిష్టతను పుల్లెల సత్యనారాయణ సిద్ధాంతి పంచాంగ పఠనం ద్వారా తెలియజేశారు. ఈ సంవత్సరంలోని మంచి, చెడులను ఆదాయ, వ్యయ ఫలాలను, రాశులవారీగా వివరించారు. శుక్రుడు, శుభగ్రహాల ఆదిపత్యం వల్ల అధికస్థాయిలో పంటలు పండుతాయన్నారు. శుభాలు జరుగుతాయన్నారు. విజనగిరి బంగార్రాజు. జి.వెంకటలక్ష్మిల నాదస్వర కచేరి అలరించింది. తర్వాత కవిసమ్మేళనానికి బలుసు వెంకట సత్యనారాయణ మూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు. అన్నమాచార్య కీర్తనలు ఆలపించిన వారిని దుశ్శాలువతో సత్కరించి మెమెంటోలను అందచేశారు. వివిధ శాఖాల అధికారులు పాల్గొన్నారు.

వేడుకల్లో హోమ్ మంత్రి

కొవ్వూరు: ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మాదిరిగానే జీవితంలో సంతోషాలు, సుఖాలు, సమస్యలు,సవాళ్లు, మంచిచెడులు సమ్మిళతమై ఉంటాయని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. కొవ్వూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాల ఫలాలను ప్రతీ ఇంటికి అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. పండితులు దోర్బల ప్రభాకరశర్మ బృందం పంచాంగ పఠనం చేసింది. కొవ్వూరులోని కొవ్వూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మ వారి దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు భారీగా క్యూలైన్‌లలో వేచి ఉన్నారు.ఆలయ ప్రాంగణంలో గరగనృత్యాలు చేశారు.



కొవ్వూరులో పండితులు దోర్బల ప్రభాకర శర్మను సత్కరిస్తున్న హోమ్ మంత్రి తానేటి వనిత



డాక్టర్ గన్ని భాస్కరరావును సన్మానిస్తున్న రాజనగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, తదితరులు

ప్రతిభావంతులకు పురస్కారాలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం సిటీ): సాంస్కృతిక రాజధానిలో ప్రతిభామూర్తులను సత్కరించుకోవడం మన భాగ్యమని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రాజమహేంద్రవరం మంజీరా కన్వెన్షన్ హాల్‌లో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాలల్లో విశేష ప్రతిభ కనబరిచిన 80 మంది ప్రముఖలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజా మాట్లాడుతూ ఉగాది పర్వదినాన విశేష ప్రతిభ కలిగిన ప్రముఖులను సన్మానించుకొనే కార్యక్రమంలో తాను కూడా భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిలో ఎంతో మంది ప్రతిభ కలిగిన కళాకారులు, వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన మేథావులున్నారన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్‌సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ కోడింగ్.. సత్ఫలితాల లోడింగ్

- 15 ఏళ్లుగా టెన్త్ పరీక్షల్లో అదే విధానం
- ఈ ఏడాదీ అమలు
- అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు



రాయవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రవేశపెట్టిన బార్‌కోడింగ్ విధానం సత్ఫలితాలనివ్వడంతో ఈ ఏడాది కూడా అదే విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. పదో తరగతి పరీక్షల మూల్యాంకనంలో ఎటువంటి ప్రభావం పడకుండా ఉండేందుకు ఈ విధానం ప్రవేశపెట్టారు. పరీక్షల ప్రారంభానికి ముందుగానే బార్‌కోడ్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

2007లో ప్రారంభం

విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షల్లో మూల్యాంకనం చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు, అక్రమాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు 2007లో బార్‌కోడింగ్ విధానం ప్రారంభించారు. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఈ విధానాన్ని తొలిసారి సోషల్ పరీక్షతో ప్రారంభించింది. విద్యార్థి పేరుతో కూడిన సమాధాన పత్రాలు ఎవరివన్నది తెలియకుండా ఉండేందుకు ప్రత్యేకంగా రూపొందించిన కాలమ్స్‌తో బార్‌కోడింగ్ విధానాన్ని ప్రభుత్వ పరీక్షల విభాగం తీసుకువచ్చింది. ఈ విధానంలో సమాధాన పత్రం ఎవరిదో తెలియదు. క్రమంగా ఈ విధానాన్ని అన్ని ప్రశ్నపత్రాలకూ అమలు చేశారు.

ముందుగా అవగాహన పెంచితేనే..

ప్రారంభంలో బార్ కోడింగ్ విధానంతో కొంత గందరగోళానికి గురయ్యారు. అయితే ఈ విధానాన్ని అన్ని పరీక్షలకూ విస్తరించడంతో బార్ కోడింగ్ విధానమే మంచిదనే ఆలోచనకు అందరూ వచ్చారు. ఏటా పదో తరగతి విద్యార్థులకు ఈ విధానం కొత్తగా ఉంటుంది కాబట్టి పరీక్షలకు ముందే బార్ కోడింగ్‌పై ప్రత్యేక అవగాహన పెంచితే బాగుంటుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటే విద్యార్థులకు మరింత అవగాహన కలుగుతుందని పలువురు తల్లిదండ్రులు సూచిస్తున్నారు.

24 పేజీల బుక్‌లెట్

పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులకు 24 పేజీలతో బుక్‌లెట్ ఇవ్వనున్నారు. గతంలో నాలుగు పేజీలతో మెయిన్ ఆన్సర్ షీట్ ఇచ్చిన అనంతరం విద్యార్థికి అవసరమైన అదనపు సమాధాన పత్రాలు ఇచ్చేవారు. గత ఏడాది నుంచి సమాధానాలు రాసేందుకు ఇంటర్మీడియెట్‌లో మాదిరిగానే బుక్‌లెట్‌ను ప్రవేశపెట్టారు. ఇది కూడా సత్ఫలితాలనిచ్చింది. ఈ ఏడాది కూడా విద్యార్థులు సమాధాన పత్రాలను బుక్‌లెట్‌లోనే రాయాల్సి ఉంటుంది. ఫిజిక్స్, బయాలజీ పేపర్లకు 12 పేజీలు, మిగిలిన పేపర్లకు 24 పేజీల బుక్‌లెట్లు సరఫరా చేస్తారు. ఇప్పటికే బుక్‌లెట్లు ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నాయి. బుక్‌లెట్ విధానం అమలు చేయడం వలన తెలివైన విద్యార్థులకు మేలు చేకూరుతుంది.

ప్రయోజనకరం



పరీక్షల నిర్వహణకు బార్ కోడింగ్ విధానం ఎంతో ప్రయోజనకరం. సమాధాన పత్రాలు గతంలో ఏ జిల్లాకు వెళ్లేవో తెలిసేది. ఈ విధానంలో ఏ సమాధాన పత్రాలు ఎక్కడకు వెళ్తున్నాయన్నది తెలియదు. అలాగే బుక్‌లెట్ విధానం వలన మాస్ కాపీయింగ్‌కు కూడా అవకాశం లేదు. బార్ కోడింగ్, బుక్‌లెట్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఈఓలకు ఆదేశాలిచ్చాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ



బార్‌కోడింగ్ పేపర్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పదో తరగతి పరీక్షల వివరాలు

హాజరయ్యే విద్యార్థులు	: 69,290
బాలురు	: 34,683
బాలికలు	: 34,607
పరీక్ష కేంద్రాలు	: 373
వీటిలో బి-కేటగిరీ	: 257
సి-కేటగిరీ	: 116

ఉమ్మడి జిల్లాలో పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు

జిల్లా	పరీక్ష కేంద్రాలు	బాలురు	బాలికలు	మొత్తం
తూర్పు గోదావరి	126	11,230	11,509	22,739
కాకినాడ	136	13,647	13,820	27,467
కోనసీమ	111	9,806	9,278	19,084



జన్మదిన వేడుకల్లో మంత్రి దాడిశెట్టి రాజా

కొత్త ఏడాది అందరూ సంతోషంగా ఉండాలి

అభిమానుల మధ్య మంత్రి రాజా జన్మదిన వేడుకలు

తుని: తెలుగు ప్రజల పండగ ఉగాది వేళ అందరూ సంతోషం, రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆకాంక్షించారు. బుధవారం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో జన్మదిన వేడుకలు అభిమానుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ప్రజల ఆశీస్సులతో రెండుసార్లు తుని నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికకావడం అదృష్టమన్నారు. ప్రజలకు మేలు చేసేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగడం సంతోషమని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఎంపీ వంగా గీత, తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, తుని మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ బొప్పన రాము, లగుడు శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యామణి, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, ఏలూరి బాలు, పోతుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘర్షణలో గాయపడ్డ యువకుడి మృతి

- శృంగవృక్షం జాతరలో దుర్ఘటన
- గ్రామంలో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు పర్యటన
- 13 మందిపై హత్యాయత్నం, అట్రాసిటీ సహా పలు కేసుల నమోదు



దాడిలో గాయపడి మృతిచెందిన రాము



శృంగవృక్షంలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

తొండంగి: కొత్త అమావాస్య పండగ సందర్భంగా మండలంలో శృంగవృక్షంలో మంగళవారం రాత్రి పెద్దింట్లమ్మ, నూకాలమ్మ జాతరలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో తొండంగికి చెందిన నడిపల్లి రాము(22) తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో రెండు రోజులుగా గ్రామదేవతల జాతర ఉత్సవం జరుగుతోంది. తొండంగికి చెందిన యువకుడు నడిపల్లి రాము శృంగవృక్షంలో అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. గ్రామంలో జాతర జరుగుతుండటంతో వెళ్లాడు. జాతరలో సిద్ధాంతపు రవి, అడపా సాయిభాస్కర్‌ల కాళ్లు తొక్కాడన్న సంఘటనపై వివాదం తలెత్తింది. ఇది రెండు వర్గాల మధ్య వివాదానికి దారి తీసింది. ఒక వర్గం దాడితో నడిపల్లి రాముతోపాటు నక్కా నాగేశ్వరరావు, నక్కా ఇస్సాక్, పులుగు గంగబాబు, సిద్ధాంతపు రవి, దడాల పెద అప్పలకొండ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వైద్యం నిమిత్తం తొండంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే రాము మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మిగిలినవారంతా తుని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆదేశాల మేరకు శృంగవృక్షంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. మృతుని తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 13 మందిపై కేసు నమోదు చేశామని తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపారు. కాగా మృతుడి వర్గీయులు గ్రామంలో రోడ్డుపై బైఠాయించి, దాడికి కారకులైనవారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో తుని రూరల్ సీఐ సన్యాసిరావు నిందితులను అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఎస్పీ రవీంద్రబాబు పర్యటన

ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు బుధవారం తుని ఏరియా ఆస్పత్రిలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకుని అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కలెక్టర్ కృతికాశుక్లాతో చర్చించి, మృతుని కుటుంబానికి నష్టపరిహారం అందిస్తామని చెప్పారు. కేసు దర్యాప్తునకు ప్రత్యేకాధికారిగా ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ, బి.అప్పారావును నియమించామని పర్యవేక్షణాధికారిగా జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పి.శ్రీనివాస్‌ను నియమించినట్టు తెలిపారు. ఎస్పీ, ఇతర అధికారుల బృందం శృంగవృక్షంలో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు.

‘శ్రీ శోభకృత్’లో సత్యదేవునికి సిరి వృద్ధి

- పంచాంగ పఠనంలో ఘనపాఠి
- రత్నగిరిపై ఘనంగా ఉగాది వేడుకలు
- వెండి రథంపై స్వామివారి ప్రాకారసేవ



వేద పండితులను సత్కరిస్తున్న చైర్మన్ రోహిత్



సత్యదేవుని రథాన్ని లాగుతున్న చైర్మన్ రోహిత్, ఎమ్మెల్సీ త్రిమూర్తులు

అన్నవరం: శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో సత్యదేవునికి ఆదాయం వృద్ధి చెంది స్వామివారి ఖ్యాతి దశ దిశలా వ్యాప్తి చెందుతుందని ఆలయ ఆస్థాన ప్రధాన వేద పండితుడు బ్రహ్మశ్రీ గొల్లపల్లి వేంకట్రామ సుబ్రహ్మణ్య ఘనపాఠి తెలిపారు. ఉగాది వేడుకలు రత్నగిరిపై అనివేటి మంటపంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం 9–30 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి ఉత్సవమూర్తులను సత్యదేవుని ఆలయం నుంచి ఊరేగింపుగా అనివేటి మంటపం వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం నూతన సంవత్సర పంచాంగాలను స్వామి, అమ్మవార్ల చెంత ఉంచి పండితులు పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించారు. వేద పండితులు శ్రీ గొల్లపల్లి వేంకట్రామ సుబ్రహ్మణ్య ఘనపాఠి ‘శోభకృత్’ నామ నూతన సంవత్సర పంచాంగ ఫలితాలను చదివి వివరించారు.

సత్యదేవునికి ఆదాయం 14.. వ్యయం రెండు

శ్రీ సత్యదేవునికి ఈ ఏడాది ఆదాయం 14, వ్యయం రెండుగా ఉందన్నారు. వ్యయం కన్నా ఆదాయం ఏడు రెట్లు అధికంగా ఉన్నందున దేవస్థానంలో సత్రాలు, నిర్మాణాలు, అభివృద్ధి పథకాలు చేపట్టేందుకు నిధులు దండిగా సమకూరతాయన్నారు. పంచాంగ శ్రవణం అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి, స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేశారు.

వేద పండితులకు సత్కారం

ఉగాది వేడుకల్లో భాగంగా ప్రముఖ వేద పండితులు పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరానికి చెందిన గుళ్లపల్లి సుబ్రహ్మణ్య అవధాని, రాజమహేంద్రవరానికి చెందిన ఉప్పులూరి సత్యనారాయణ అవధానిలను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ సత్కరించారు. రూ.5,116 చొప్పున నగదు పారితోషికం, నూతన వస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను బహూకరించారు. ఆస్థాన వేదపండితుడు గొల్లపల్లి వేంకట్రామ సుబ్రహ్మణ్య ఘనపాఠిని సన్మానించి నూతన వస్త్రాలు బహూకరించారు. దేవస్థానం స్మార్త, ఆగమ పాఠశాల విద్యార్థులకు, వారి గురువు నృశింహశర్మకు నూతన వస్త్రాలను బహూకరించారు.

ఘనంగా రథోత్సవం

ఆలయ ప్రాకారంలో స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉదయం 11 గంటలకు స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దకు తీసుకువచ్చి వెండి రథంపై స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మంగళ వాయిద్యాలు, పండితుల మంత్రోచ్చారణ నడుమ దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఏసీ రమేష్ బాబు రథం లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు.

21 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

అయినవిల్లి: మండలంలోని మాగాం గ్రామంలో క్షత్రియ కల్యాణ మంటపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో అయినవిల్లి ఎస్సై ఎస్.నాగేశ్వరరావు బుధవారం సాయంత్రం తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న 21మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.2,29,890 స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టుకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎం సహాయ నిధి నుంచి రూ.12.05 లక్షలు



చెక్కులు పంపిణీ చేస్తున్న హోం మంత్రి వనిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఏడుగురికి అందిన రూ.12.05 లక్షల ఆర్థిక సాయం చెక్కులను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. పట్టణంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఈ చెక్కులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆరోగ్య శ్రీలో ఎన్నడూ లేని విధంగా వైద్య సేవలందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదే అన్నారు. వైద్య సేవలలో ఆయా పేద కుటుంబాలకు అండగా ఉండాలని ఈ సాయం అందజేస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి, వైస్ చైర్ పర్సన్ అంజనీదేవి, పాల్గొన్నారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు



ఆలయ ఆవరణలో వేదాలు వల్లిస్తున్న పండితులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి అధ్యయనోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉగాది పర్వదినం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ద్రవిడ పారాయణం, దివ్య ప్రబంధనం, తదితర కార్యక్రమాలను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి గరుడ, సింహ వాహనాలపై గ్రామోత్సవం నిర్వహించారు. పండితులు చతుర్వేద పారాయణ నిర్వహించారు. అధ్యయనోత్సవాల గురించి భక్తులకు వేద పండితులు వివరించారు. అనంతరం ఆళ్వారుల ప్రసాద వినియోగం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 31 నుంచి జరిగే స్వామి వారి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.



స్వామివారి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి